ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 5 డిసెంబరు 2024



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

## ఆశాలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

» కలెక్టరేట్ ఎదుట ధర్నా

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని ఆశలు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బీమా రూ.50లక్షలు వర్తించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. 6 నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత, అధ్యక్షురాలు కవిత, నాయకులు బాల్‌రాజ్, శేఖర్, పెంటయ్య, రంగం, సరస్వతి, రాధిక, భాగ్య, శ్రీలత, సుజాత, నిర్మల, కమల, జాంతీర్ బేగం పాల్గొన్నారు.

వరికోతకు యంత్రాల కొరత 8
సరిపడా హార్వెస్టర్లు లేక రైతుల ఇక్కట్లు
కూలీలు కూడా దొరకని పరిస్థితి
ఒకేసారి పంట కోతకు రావడంతో తిప్పలు
వాడిపోయి నేలకొరుగుతున్న వరి



తుంపర సాగు భళా! 7
ట్యూబ్ పైప్‌లైన్‌తో డ్రిప్పింగ్
కూరగాయల సాగుకు ఎంతో అనుకూలం
తక్కువ నీటితో పెద్దమొత్తంలో సేద్యం
స్వల్ప పెట్టుబడితో సాగుపై రైతుల ఆసక్తి



నియామకం

### ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ
## చైర్మన్‌గా గురునాథ్‌రెడ్డి



గురునాథ్‌రెడ్డి



కరుణాకర్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నేత కంభాలపల్లి గురునాథ్‌రెడ్డిని నియమించారు. ఆయన గతంలో ఇదే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే వైస్ చైర్మన్‌గా మంకాల కరుణాకర్, సభ్యులుగా తుమ్మాటి శ్రీశైలం, సుబ్బురు మల్లిక, కనమోని లింగస్వామి, మొద్దు కరుణాకర్‌రెడ్డి, దొంతరమోని రాజు, తాళ్ల మహేష్‌గౌడ్, కొర్ర పాండు, సాతిరి ఎల్లయ్య, గులాం అక్బర్, మస్కు నర్సింహ, నెల్లి శివకుమార్, బూడిద రాఘవేందర్‌రెడ్డితోపాటు ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, మున్సిపల్ చైర్ పర్సన్‌లు సభ్యులుగా ఉంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కమ్మదనం శివారులోని ఫాంహౌజ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఫాంహౌజ్‌లలో పోలీసుల తనిఖీలు

షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని ఫాంహౌజ్‌లతో పాటు పట్టణంలోని లాడ్జీలు, కిరాణా దుకాణాల్లో బుధవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గుట్కా, ఇతర మత్తు పదార్థాలు క్రయ విక్రయాల నియంత్రణకు సోదాలు చేపట్టినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన వ్యాపారాలు..
# గాలిలో ప్రాణాలు

### డేంజర్‌లో రైతులు, చిరు వ్యాపారుల బతుకులు

- ప్రమాదమని తెలిసినా దారుల వెంట అమ్మకాలు
- యాక్సిడెంట్లతో వీధిన పడుతున్న కుటుంబాలు
- జిల్లావ్యాప్తంగా రైతుబజార్‌లు నిరుపయోగం
- అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలు

జిల్లావ్యాప్తంగా రహదారులు చిరు వ్యాపారాలకు స్థావరాలయ్యాయి. రైతులు పండించిన పంటలు స్థానిక రోడ్ల పక్కనే ఉంచి అమ్ముకుంటున్నారు. ప్రమాదమని తెలిసినా జీవనాధారం కోసం చేసే బతుకుపోరాటంలో ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. రహదారుల పక్కన వాహన చక్రాల కింద నలిగిపోతూ వారి కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చుతున్నారు. రైతుబజార్‌లు ఉన్నా అక్కడ వ్యాపారం సరిగా సాగక దారుల వెంట దుమ్ము ధూళిలో బతుకులు ఈడుస్తున్నారు.



ఆమనగల్లులో రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న రైతులు, వ్యాపారులు



చేవెళ్లలో నిరుపయోగంగా రైతుబజార్

ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతులు, చిరు వ్యాపారుల బతుకులు డేంజర్‌గా మారాయి. రోడ్డు పక్కన విక్రయాలు జరుపుకునే వీరిపైకి ఏ క్షణంలో ఏ వాహనం దూసుకు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద రోడ్డు పక్కన కూరగాయలు అమ్మే రైతులపై నుంచి ఓ లారీ దూసుకెళ్లి బీభత్సం సృష్టించిన ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునేవారు భయం గుప్పిట్లో బతుకు వెళ్లదీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు, చిరు వ్యాపారులు కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకోవడానికి సరైన స్థలం లేక రోడ్ల పక్కన విక్రయాలు జరుపుతూ క్షణక్షణం భయపడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మార్కెట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మంచాల మండలం చిన్నారెడ్డిగూడ నుంచి నగరంలోని ఎన్టీఆర్ నగర్ మార్కెట్‌కు ఆటోలో కూరగాయలు తరిస్తుండగా ఐదేళ్ల

మిగతా 7వ పేజీలో...



గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న దశరథ్

## గురుకులాలపై చిన్నచూపు

### బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

చేవెళ్ల, డిసెంబరు 4 ( ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను విస్మరిస్తుందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆరోపించారు. బుధవారం చేవెళ్ల మండలంలో ఉన్న ఆయా గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మాజీ సీఎం కేసీఆర్ కార్పొరేట్‌కు దీటుగా గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను పట్టించుకోవడం లేదన్నారు. గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పాఠశాలల సందర్శనకు వెళ్తే సిబ్బందిని అడ్డుకోవడం సరి కాదన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మోటిక్ చార్జీలను ఉపాధ్యాయులే కాజేస్తున్నారని ఆరోపించారు. అద్దె భవనాల అద్దెలు కూడా పూర్తిస్థాయిలో చెల్లించలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనర్సింహ రెడ్డి, ఆసిఫ్, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో కొనసాగుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియ



# 91.3%

## సమగ్ర కుటుంబ సర్వే పూర్తి

| డాటా ఎంట్రీ వివరాలు (కుటుంబాలు) | |
|---|---|
| రూరల్ | శాతం |
| 2,77,786 | 97.4 |
| మున్సిపాలిటీ | శాతం |
| 3,35,747 | 71.3 |
| మొత్తం | శాతం |
| 6,13,533 | 83.1 |

- శరవేగంగా ఆన్‌లైన్ ఎంట్రీ
- ఇప్పటి వరకు 6,13,533 కుటుంబాల వివరాలు కంప్యూటీకరణ
- షిఫ్టుల వారీగా 24 గంటలూ డాటా ఎంట్రీ

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయింది. బుధవారం వరకు మొత్తం 91.3 శాతం కుటుంబాల వివరాలు సేకరించారు. గ్రామీణ ప్రాంతంలో 99 శాతం, మున్సిపాలిటీల్లో 83.1 శాతం సర్వే జరిగింది. ఇంటికి తాళాలు వేసి ఉన్న కుటుంబాల వివరాలను కూడా సేకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 6,04,421 ఇళ్లను గుర్తించగా 5,376 మంది ఎన్యూమరేటర్లు 5,58,753 ఇళ్లలోని కుటుంబాల వివరాలు నమోదు చేశారు. అందులో గ్రామీణ ప్రాంతాల్లో 2,70,520, మున్సిపాలిటీల్లో 2,88,233 ఇళ్లలోని కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు.

### డాటా ఎంట్రీ వేగిరం..

ఇప్పటి వరకు సేకరించిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కేంద్రాలతో పాటు కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రత్యేకంగా నియమించుకున్న ఆపరేటర్ల ద్వారా డేటా ఎంట్రీ శరవేగంగా జరుగుతుంది. సర్వే ఆన్‌లైన్ వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కంప్యూటర్ ఆపరేటర్లకు సూచనలిస్తున్నారు. ఆయా కుటుంబాల్లో ఇద్దరు ముగ్గురు సభ్యులుంటే వివరాల నమోదుకు 15 నిమిషాలు, ఐదుగురు ఉంటే 20 నిమిషాలు, ఏడుగురు అంతకంటే ఎక్కువగా ఉంటే అరగంట వరకు సమయం పడుతుందని ఆపరేటర్లు పేర్కొంటున్నారు.

## పోలింగ్ కేంద్రాలకు భవనాలను గుర్తించండి

» జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఆమనగల్లు , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు అనువైన పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలను గుర్తించాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. ఆమనగల్లులోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న పథకాలు, అసంపూర్తి పనులపై చర్చించారు. జడ్పీ సీఈవో మాట్లాడుతూ... సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌లో ఎంట్రీ పూర్తయిన వెంటనే పత్రాలను భద్రపరచాలని సూచించారు. సీఎం కప్ పోటీలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని, పారిశుధ్య కార్యక్రమాల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో కుసుమ మాధురి, ఏపీవో మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సీఎం కప్-2024కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

షాబాద్/శంషాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 క్రీడాపోటీలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7, 8న తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీఎం కప్-2024 క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడాపోటీలతో పాటు యోగా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు https//cmcup2024.telangana.gov.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలన్నారు. అలాగే గ్రామ, మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహస్తున్నట్లు శంషాబాద్ ఎంపీడీవో మున్ని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని క్రీడాకారులు శంషాబాద్ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

# ప్రజలే ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి

### విష రాజకీయాలు చేస్తున్న విపక్షాలు

- బీఆర్ఎస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం
- సంక్రాంతి పండగ తర్వాత అర్హులకు రైతు భరోసా
- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ఆమనగల్లు సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆమనగల్లు , డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ): విపక్షాల కుట్రలు, విష రాజకీయాల నుంచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలే కాపాడుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అధ్యక్షతన ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం స్థానిక లక్ష్మీ గార్డెన్‌లో అట్టహాసంగా జరిగింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, సభ్యులతో జిల్లా మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రియాజ్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనను జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీల 64 ఏళ్ల పాలనలో రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే.. బీఆర్ఎస్ పదేళ్లలో విద్యుత్ రంగాన్ని కలుపుకొని రూ.8 లక్షల కోట్ల

మిగతా 8వ పేజీలో...

# వాగులో వైకుంఠధామం

- » వర్షాలకు పారుతున్న వాగు
- » శ్మశాన వాటికలోకి చేరిన నీరు
- » ఖననం చేయడానికి ఇబ్బందులు
- » కుంగుతున్న సమాధులు



వాగులో శ్మశాన వాటిక

కేశంపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంతిమ యాత్రలో ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం గ్రామాలలో వైకుంఠధామాలను నిర్మించింది. కానీ అధికారుల అనాలోచిత నిర్ణయంతో కేశంపేట మండలం వేముల్‌నర్వ గ్రామ సమీపంలో నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. వాగులో వైకుంఠధామం నిర్మించడంతో శవాలను ఖననం చేయడానికి ప్రజలు నానాయాతన పడుతున్నారు. వేముల్‌నర్వ- చింతకుంటపల్లి వాగు పారుతుండడంతో శ్మశాన వాటికలోకి నీరు చేరింది. వైకుంఠధామంలోని స్నానపు గదులు, మూత్రశాలలు. వస్త్రాలు మార్చుకోవడానికి గదులు ఉపయోగించలేని పరిస్థితి ఉంది. అంతేకాకుండా శ్మశాన వాటికలో విపరీతంగా గడ్డి పెరిగి అడుగు పెట్టలేకుండా ఉంది. సమాధులు సైతం ఓ వైపుకు కుంగిపోతున్నాయి. వైకుంఠధామాన్ని వాగులో నిర్మించడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### సరైన స్థలంలో నిర్మిస్తే బాగుండేది..



వాగులు, చెరువులలో వైకుంఠధామాలు నిర్మిస్తే ఎవరికి ఉపయోగపడతాయి. అధికారులు స్థల ఎంపికలో జాగ్రతలు పాటించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

- ఇమ్మిడి కార్తీక్,
వేముల్‌నర్వ - కేశంపేట మండలం

## జిల్లాలో భూకంపం

### ఇబ్రహీంపట్నం, మాడ్గుల మండలం ఆవురుపల్లిలో స్వల్పంగా కంపించిన భూమి



ఇబ్రహీంపట్నం / ఆమనగల్లు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ): ఇబ్రహీంపట్నం, మాడ్గుల మండలం ఆవురుపల్లి గ్రామంలో స్వల్పంగా భూమి కంపించడం కలకలం రేపింది. ఉదయం 7:27 గంటల సమయంలో మూడు నుంచి ఐదు సెకండ్ల పాటు భూమి కంపించిందని, ఇళ్లలోని వస్తువులు కదిలి శబ్దం వచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామంలో మునుపెన్నడూ భూమి ఇలా కంపించలేదని తెలిపారు. ఈ ప్రకంపన ప్రభావం పెద్దగా లేకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

## అనురాగ్‌లో ముగిసిన హ్యాకథాన్ బూట్‌క్యాంప్



బూట్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో రెండురోజుల పాటు నిర్వహించిన హ్యాకథాన్ బూట్‌క్యాంప్ బుధవారంతో ముగిసింది. టాస్క్, ఐబీఎం, బ్లాక్‌కోడ్ సహకారంతో అనురాగ్ యూనివర్సిటీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో హ్యాక్ అటాక్ హ్యాకథాన్ విజయవంతంగా నిర్వహించారు. ఈ హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు 676మంది విద్యార్థులతో కూడిన 150జట్లు నమోదు చేసుకున్నాయి. వీటిలో 478మంది విద్యార్థులతో కూడిన 80జట్లు తుది హ్యాకథాన్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 6,7న జరగబోయే 30గంటల హ్యాకథాన్‌లో సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన నైపుణ్యాలను, సాధనాలు, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఎస్ఓఈ విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. హ్యాకథాన్ బూట్‌క్యాంప్‌లో పాల్గొనే వారు మార్గదర్శకత్వం, ప్రయోగాత్మక అభ్యాసం, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను రూపొందించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. 30 గంటల హ్యాకథాన్ బూట్‌క్యాంప్‌లో విద్యార్థులు పోటీ వాతావరణంలో సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించడానికి కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ కేఎస్‌రెడ్డి, ఐటీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నీతీషాశర్మ, సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వైవీరెడ్డి, శేఖర్ రెడ్డి, పృథ్వీరాజ్‌గౌడ్, ఆనంద్‌బాబు, సౌజన్య సాయికృష్ణ, ఆశాలత, విద్యార్థులు మన్సూర్ షేక్, తన్నీరు మహేష్, అన్నారం ప్రశాంత్, చెన్నజీవన్ పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణపై దృష్టి సారించాలి



అడవి సంరక్షణ గురించి వివరిస్తున్న డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్

వికారాబాద్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణపై విద్యార్థులు, యువత దృష్టి కేంద్రీకరించాలని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లో ఆయన విద్యార్థులకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థులతో అడవిలో నేచర్‌వాక్ కార్యక్రమం నిర్వహించారు. అడవిలో ఉండే చెట్లు, చెట్ల పెంపకంపై వివరించారు. అయన డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ అనంతగిరి అడవి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్‌వో శ్యామ్‌కుమార్, ధారూరు అటవీ క్షేత్ర అధికారి బి.రాజేందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పల్లెకు పక్కా రోడ్డు

### మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కేఎల్లార్

మహేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా అవసరాల నిమిత్తం ప్రభుత్వం మొదలు పెట్టిన అభివృద్ధి పనులను చేయడంలో నిర్లక్ష్యం వహించిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం క్షమించదని మాజీ ఎమ్మెల్యే మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. బుధవారం కల్వకోల్ - అమీర్‌పేట గ్రామాల మధ్య కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఈ ప్రభుత్వంలో ప్రతీ పల్లెకు పక్కా రోడ్డు, రవాణా సౌకర్యాలను కల్పిస్తామన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతీ ఇంటిలో శివాజీ, రుద్రమదేవి తయారు కావాలి

### బసిరెడ్డిపల్లి పీఠాధిపతి కృష్ణానంద స్వామి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు

వికారాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఇంటిలో ఒక శివాజీ, రుద్రమదేవి తయారు కావాలని బసిరెడ్డిపల్లి పీఠాధిపతి కృష్ణానంద స్వామి అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం వికారాబాద్ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులంతా ఏకతాటి పైకి వచ్చి బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చేలా చేయాలన్నారు. హిందూ ఐక్యత గురించి ప్రపంచానికి తెలియజేయాలన్నారు. బంగ్లాదేశ్‌లో గతంలో దాడులు జరిగాయని, ఇప్పుడు మళ్లీ జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, హిందూ ఐక్య వేదిక నాయకుడు చౌదరి యాదవరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి శ్రీలతారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సదానందరెడ్డి , వివేకానందరెడ్డి, నందు, శివరాజు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, బొర్రెడ్డి కిరణ్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, డాక్టర్ రాజశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జీవితంలో యోగా భాగం కావాలి



యోగా వికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆ సంస్థ చైర్మన్ మాధవన్‌జీ

మహేశ్వరం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ప్రతీ ఒక్కరికి పెరుగుతున్న పని ఒత్తిడి తదితర కారణాలతో యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని అవేర్‌సంస్థ చైర్మన్ మాధవన్ జీ అన్నారు. బుధవారం తుమ్మలూరు రెవెన్యూ భగవతీపురంలో యోగా విద్యా వికాస కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యోగా సాధన వల్ల శారీరక అభివృద్ధితో పాటు మానసిక వికాసం పొంద వచ్చన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత చేకూరడంతో పాటు వ్యాధులు నయమవుతాయన్నారు. అవేర్ సంస్థలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఈ యోగా సెంటర్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజానీకానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజవర్ధన్‌రెడ్డి, జయేష్‌కుమార్, మహేంద్ర, జాఫర్, గణేష్, తరుణ్, మోహన్‌బాబు, వెంకన్న, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ రహదారి పక్కనే భోజనం చేసే సెంటర్

చైనీస్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్





# యథేచ్ఛగా స్ట్రీట్‌ఫుడ్ దందా!

### గల్లీకో కర్రీ పాయింట్- ఫాస్ట్ ఫుడ్ సెంటర్



బేకరీలో ఉన్న జంక్ ఫుడ్

- కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు
- మేడ్చల్‌లో అంతా ఇష్టారాజ్యం
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

మేడ్చల్‌టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో స్ట్రీట్ ఫుడ్ దందా మూడు బిర్యానీలు ఆరు కూరల్లా సాగుతోంది. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేస్తున్న తినుబండారాలను తిని ఆ మాయక ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. గల్లీకో కర్రీ పాయింట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేసి అడ్డదారిన ధనార్జనకు పాల్పడుతున్నారు. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రాంతాల్లో తినుబండారాలు విక్రయిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు పత్తా లేకుండా పోయారు. దీంతో ఈ వ్యాపారానికి అడ్డూఅదుపు



అపరిశుభ్రంగా ఉన్న టిఫిన్ సెంటర్

లేకుండా పోయిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అనుమతులు లేకుండానే వ్యాపారం

హోటళ్ల నిర్వహణ, కర్రీ పాయింట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వహణకు అనుమతులు లేకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఉదయం టిఫిన్స్, మధ్యాహ్నం, కర్రీలు, సాయంత్రం ఫాస్ట్ ఫుడ్, మిర్చీ బజ్జీల తయారు చేసి విక్రయిస్తున్న వారి సంఖ్య స్థానికంగా వందల్లో ఉంటుంది. ఈ వ్యాపారాలు మొత్తం రోడ్డు పక్కన చిన్నపాటి షెడ్లలో, తోపుడు బండ్లపై నిర్వహిస్తున్నారు. ఇక్కడ తిన్న వారికి ఏదైన ఆరోగ్య సమస్య తలెత్తితే సదరు వ్యాపారి తన స్టాల్‌లో కొద్ది రోజులు తినుబండారాల విక్రయాలు ఆపివేసి తిరిగి యథావిధిగా వ్యాపారాన్ని సాగిస్తున్నారు.

### వండిన రెండు గంటలకే..

స్థానికంగా కర్రీ పాయింట్‌లో తయారు చేస్తున్న వెజ్, నాన్‌వెజ్ కర్రీలు వండిన రెండు గంటలకే కుళ్లిపోతున్నాయంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. పార్సల్ చేసి తీసుకొచ్చిన కర్రీలను రెండు గంటల వరకు తినకుండా అట్టే వదిలేస్తే కర్రీనుంచి కుళ్లిపోయిన వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తయారు చేసే నూడుల్స్ చికెన్ ఐటమ్‌లలో రుచిని పెంచే కెమికల్ సాల్ట్, రసాయనాలు కలిపిన సాస్‌లను వాడుతున్నారు. దీంతో వాటిని తిన్న వారికి జీర్ణ సమస్య నెలకొని ఇబ్బందులు పడుతున్నారు.

### కనీస జాగ్రత్తలు కరువు

ప్రస్తుతం మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున రహదారి పై ఉన్న దుమ్ము దూళి నేరుగా రహదారికి ఆనుకుని ఉన్న స్ట్రీట్ ఫుడ్ సెంటర్లలోకి చేరుతోంది. అయినప్పటికీ వ్యాపారస్తులు దుమ్ము చేరకుండా చర్యలు తీసుకోకుండా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నుంచి ముకుంద్ థియేటర్ వరకు రహదారికి ఇరువైపుల వందల సంఖ్యలో స్ట్రీట్ ఫుడ్ వెండర్లు ఉన్నారు. కనీసం ఈ వ్యాపారస్తులు దుమ్ము దూళి మధ్య తినుబండారాలు విక్రయించకుండా నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

### కనిపించని శుభ్రత

స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్ నిర్వాహకులు ఎరిసరాలను మురికిగా ఉంచడంతో తినుబండారాల పై ఈగలు, దోమలు వాలుతున్నాయి. వండే పాత్రలు కూడా శుభ్రం చేయకుండా తిను బండారాలను తయారు చేసి బహిరంగంగా స్టాల్‌లో పెడుతున్నారు. దీంతో రోడ్డు మీద దుమ్ము, దూళి మొత్తం తినుబండారల మీద చేరి తిన్నవారు అస్వస్థతకు గురవుతున్నారు. వీధుల్లోని కూడళ్ల వద్ద గప్‌చుప్, మిర్చి బజ్జీలు తయారు చేసే వ్యాపారస్తులు దుమ్ము, దూళితోనే తాము తయారు చేసిన తిను బండారాలకు దర్జాగా విక్రయిస్తున్నారు.

## హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయిస్తాం

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు పరామర్శ

చేవెళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు గడువులోగా పూర్తి చేయించేలా కృషి చేస్తామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకులతో కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బుధవారం సాయంత్రం పరామర్శించారు. చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామంలో ఉన్న దామరిగిద్ద కృష్ణ తల్లిదండ్రులను, నక్కలపల్లి రాములు కుటుంబ సభ్యులను, నాన్‌చెరు గ్రామంలోని శ్యామల సుజాత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. అలాగే గాయపడిన బాధితులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 20వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి కూరగాయలు పండించి వాటిని అమ్ముకుంటు జీవనం సాగిస్తున్న రైతులు రోడ్డు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. ధైర్యంగా ఉండాలని భరోసాని నిచ్చారు. 2017లోనే తాను రోడ్డు మంజూరు చేయించానని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన రోడ్డు విస్తరణకు నోచుకోలేదన్నారు. బయటి వ్యక్తులు అభివృద్ధిని అడ్డుకునేందుకు చెట్ల పేరుతో ఎన్‌జీవోలతో కేసులు వేస్తున్నారని చెప్పారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమా కేసులు ముఖ్యమా అని ప్రశ్నించారు. తన హయంలోనే రోడ్డు మంజూరైందని మళ్లీ తన హయంలోనే పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే ఏడేళ్లుగా రోడ్డు



ఆలూర్‌లో మృతుడు కృష్ణ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. ప్రస్తుతం రోడ్డ పనులు మొదలు అయ్యాయని చెప్పారు. దగ్గరుండి తామే త్వరితగతిన పూర్తి చేయించే విధంగా కృషి చేస్తామన్నారు. హైవే రోడ్డు పక్కన రైతులు నేరుగా కూరగాయలు అమ్ముకునే విధంగా ప్రత్యేకంగా భూ సేకరణ చేసి స్థలం ఏర్పాటు చేసేలా కేంద్రమంత్రి నితిన్ గడ్కరితో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, బీజేపీ నాయకులు మహేందర్, పాండురంగారెడ్డి, కృష్ణగౌడ్, అనంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుంచ శ్రీనివాస్, రాములు, శర్వలింగం, వైభవ్‌రెడ్డి, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి



మధుసూదన్‌రెడ్డితో ఎర్రోనిగూడ వాసులు

షాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని జిల్లా గంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎర్రోనిగూడ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన నివాసంలో గ్రామస్తులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులు, నేతలను ఎన్నిసార్లు కలిసి విన్నవించినా రోడ్డువేయలేదని గ్రామస్తులు ఆయనకు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే ప్రతీ పల్లెను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామస్థులు ప్రభాకర్, డి.మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్.జైపాల్‌రెడ్డి, ఎస్.మహేందర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్వర్, ఎం.మహేందర్‌రెడ్డి ఉన్నారు.

## పండ్ల తోటల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించండి

మంచాల, డిసెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సురేష్ రైతులకు సూచించారు. ఉద్యానతోటల సాగుపై మంచాల రైతు వేదికలో మండల ఉద్యానవన అధికారిణి నవీన అద్వర్యంలో వివిద గ్రామాలకు చెందిన అన్నదాతలకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఉద్యానశాఖ అధికారి సురేష్ మాట్లాడుతూ మామిడి పూత సమయంలో ఆకాశం మేఘావృతమై పూత ఎక్కువగా రాలుతుందని చెప్పారు. థైమితోకం మందును నీటిలో కలిపి పిచికారి చేసినట్లయితే పూత రాలడాన్ని నివారించవచ్చన్నారు. కూరగాయ తోటల్లో కలుపు నివారణ క్రమం తప్పకుండా చేయాలని చెప్పారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని పెంచాలన్నారు. ఆయిల్‌పాం తోటల పెంపకం లాభసాటిగా ఉంటుందని, దీని సాగుకు ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తుందని



రైతులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీకృష్ణ, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ముత్యాలు, ఏడీహెచ్ అరుణ, ఏవో కృష్ణమోహన్, ఏఈవో లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## 28, 29న సీపీఎం జిల్లా మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చెన్నయ్య, నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి ): సీపీఎం జిల్లా మహాసభలు ఈనెల 28, 29వ తేదీల్లో ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా నాయకుడు దుబ్బ చెన్నయ్య తెలిపారు. మహాసభలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిలో బుధవారం సీపీఎం గ్రామ కమిటీ సమావేశం స్థానిక కార్యదర్శి కొమ్ము చెన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా మహసభల విజయవంతం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పోరాట కార్యాచరణపై చర్చించారు. మహాసభలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి చెన్నయ్య ఆవిష్కరించారు. గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించాలని నాయకులు కోరారు. కావలి సాయిలు, దైవానందం, బండ కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

## రైల్వే ఎంప్లాయీస్ సంక్షేమానికి కృషి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ఎంప్లాయీస్ సంక్షేమానికి తమ కార్మిక సంఘం అహర్నిశలు పాటుపడుతోందని దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ హైదరాబాద్ డివిజన్ కార్యదర్శి బాలకృష్ణ అన్నారు. బుధవారం మేడ్చల్‌లో నిర్వహించిన కార్మిక సంఘం ఎన్నికల నిర్వాహణ తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో తమ సంఘం విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ శాఖ కార్యదర్శి శంషాల్ హక్, వైస్‌చైర్మన్ వెంకటరాజు, నాయకులు నాగరాజు, కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నాస్ పరీక్షలు ప్రశాంతం

వికారాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):: వికారాబాద్ జిల్లాలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్షలు బుధవారం 3, 6, 9 తరగతుల ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించామని డీఈవో రేణుకాదేవి తెలిపారు. మొత్తం 105 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. ఈ పరీక్షలు తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో సీబీఎస్ఈ బోర్డు మార్గదర్శకాల మేరకు నిర్వహించామన్నారు. ప్రతీ పాఠశాలకు నాస్ పరీక్ష పర్యవేక్షకులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను నియమించామన్నారు. కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంల పర్యవేక్షణలో పరీక్షలు పూర్తయ్యాయని ఆమె తెలిపారు.

## గోర్‌బోలిని లంబాడీల అధికారిక భాషగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబల్‌నాయక్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)! లంబాడీలు మాట్లాడుతున్న గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి అధికారికంగా ప్రకటించాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన ఎల్‌హెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడ భాష గోర్‌బోలికి లిపి లేకపోవడంతో లంబాడీలకు గుర్తింపు లేకుండా పోతున్నదని అన్నారు. లంబాడ విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తూ, వారు విద్య, ఉద్యోగాలలో రాణిచేలా ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. లంబాడిల ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీల ఆస్తులను లాక్కుంటామంటే సహించబోమని హెచ్చరించారు. అనంతరం నియోజక వర్గంలోని ఆరు మండలాలల ఎల్‌హెచ్‌పీఎస్ నూతన కమిటీలను ఎన్నుకున్నామని రాంబల్ తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చందర్‌నాయక్, దశరథ్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, మోహన్‌నాయక్, సుధాకర్‌నాయక్, శ్రీనివాస్ నాయక్, మోతీలాల్‌నాయక్, సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

షాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ అన్నారు. బుధవారం నాగర్‌గూడలో వెల్‌స్పన్ ఫౌండేషన్, షాద్‌నగర్ ఏబీసీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 110 మందికిపైగా ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, బీసీఐ మేనేజర్ పవన్‌కుమార్, శిరీష, రమేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు


దుద్యాలలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాంరెడ్డి

బొంరాస్‌పేట్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కొనుగోళ్లను పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి రాంరెడ్డి అన్నారు. బుధవారం దుద్యాల రైతు వేదిక వద్ద కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు వెంటనే డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

## నాస్ పరీక్షను పరిశీలించిన డీఈవో రేణుకాదేవి


కంకల్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

పూడూరు, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన నాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షను డీఈవో రేణుకాదేవి పర్యవేక్షించారు. బుధవారం పూడూరు మండలం సోమన్‌గుర్తి, కంకల్ పాఠశాలలను డీఈవో సందర్శించారు. డీఈవో పాఠశాలల్లో ప్రత్యేక తరగతులపై హెచ్ఎంలను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డీఈవో వెంట నాస్ అబ్జర్వర్ మధుసూదనరెడ్డి, ఎంఈవో సాయిరెడ్డి, జీహెచ్ఎం పుష్ప, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన ఆశా వర్కర్లు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి ఎం. రేవతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్లు నిర్వహించిన ఆందోళనకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని, వేతనం రూ.18వేలకు పెంచాలన్నారు. ఆశాలను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్ట పరిధిలోకి తేవాలని, అంతేకాకుండా ఆశాలపై ప్రభుత్వ అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు అశోక్, కోశాధికారి ఉన్ని కృష్ణ, జయప్రద, రాధ, యాదమ్మ, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



చలో పెద్దపల్లికి తరలివెళ్లుతున్న గ్రూప్-4 అభ్యర్థులు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగంలో చేరనున్న గ్రూప్-4 అభ్యర్థులు అంకితభావంతో పనిచేయాలని డీఆర్‌డీవో సాంబశివరావు తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా పెద్దపల్లిలో బుధవారం చేపట్టిన యువ వికాస్ కార్యక్రమానికి 511మంది గ్రూప్-4 అభ్యర్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగంలో చేరే వారు అంకితభావంతో పనిచేసి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. జిల్లాలో ఉత్తీర్ణులైన 511మంది గ్రూప్-4 అభ్యర్థులను పెద్దపల్లిలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు బస్సులో తరలించారు. అభ్యర్థుల భద్రత దృష్ట్యా బస్సులో పోలీసు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అకౌంట్స్ అధికారి రామ్మోహన్, బాబూ మోసిస్, వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## దివ్యాంగులను ప్రోత్సహించడం అభినందనీయం



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ఆర్థికంగా ప్రోత్సహించడం అభినందనీయం అని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అన్నారు. బుధవారం అంర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగులు బాధపడకుండా మనోధైర్యంతో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ రమేష్, నాయకుడు జాఫర్, ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ దేవి, జిల్లా కో-ఆర్డినేటర్ రామేశ్వర్, వికలాంగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్ నాయక్


దశరథ్‌నాయక్‌కు నియామక పత్రం ఇస్తున్న రాంబల్ నాయక్

కడ్తాల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడ్తాల మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు షాద్‌నగర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో దశరథ్ నాయక్‌కు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ కమీషన్ మాజీ సభ్యుడు రాంబల్ నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. గిరిజన జాతి ఉద్ధరణ, తండాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలను గుర్తించి దశరథ్ నాయక్ కు రాష్ట్ర స్థాయిలో చోటు కల్పించారు. పీఏసీఎస్ చైర్మన్, జడ్పీటీసీగా, బీఆర్ఎస్ , గిరిజన నేతగా దశరథ్ నాయక్ కల్వకుర్తినియోజకవర్గంలో పోరాటాలు కొనసాగిస్తూ వస్తున్నారు. రాంబల్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర గిరిజన సేవా సంఘం నాయకులు సేవ్యానాయక్, హరిచంద్ నాయక్, శ్రీను, జగన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


డ్రిప్ విధానంలో సాగవుతున్న చేను

టూబ్ పైప్‌లైన్‌తో డ్రిప్పింగ్

# తుంపరతో సాగు భళా!

- కూరగాయల సాగుకు ఎంతో అనుకూలం
- తక్కువ నీటితో పెద్దమొత్తంలో సేద్యం
- పెట్టుబడీ అంతంతే..

తుంపర సేద్యంపై రైతుల ఆసక్తి

మంచాల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీ వ్యవసాయరంగంలోనూ వాడుతున్నారు. కాలానుగుణంగా అనేక మార్పులతో సులభతర వ్యవసాయం అన్నదాతలకు చేరువవుతోంది. ఫలితంగా వ్యవసాయం దండగ అనే రోజులు పోయి.. పండగ అనే రోజులు వచ్చాయని చెప్పవచ్చు. ఇదివరకు వ్యవసాయమంటే అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి సేద్యం చేసేవారు. టెక్నాలజీలో వచ్చిన విప్లవాత్మక మార్పులు శారీరక శ్రమను తగ్గిస్తున్నాయి. మంచాల మండల పరిధిలో అనేక రైతు కుటుంబాలు తమ వ్యవసాయ పద్ధతుల్లోనూ మార్పులు చేసుకుంటూ పంటలు సాగు చేసి ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా తుంపర సేద్యం ఇటీవల కాలంలో అన్నదాతల ఆదరణ చూరగొంటోంది. పంటల సాగులో ఈజీగోయింగ్‌గా ఉండడంతో తుంపర పద్ధతిలో ఆకు, కాయగూరలు పండిస్తూ ఉపాధి పొందుతూ లాభాల బాటలో పయనిస్తున్నారు.

### నగర శివారు నుంచి మండలాలకు..

ఆకుకూరల సాగు నగర శివారు నుంచి సమీప మండలాలకు విస్తరించింది. ఇదివరకు ఆకుకూరలను ఎక్కువగా నగర శివారులోని తుర్కయంజాల్, మన్నెగూడ, కోహెడ తదితర ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిని పలు ప్రాంతాల్లో బాగా పండించేవారు. ఈ ప్రాంతాలన్నీ నేడు నగర విస్తరణతో కాంక్రీట్‌మయయంగా మారి గ్రేటర్‌లో కలిసిపోయాయి. దాంతో క్రమేపీ ఆకుకూరల సాగు శివారు ప్రాంతాలకు విస్తరించింది. ముఖ్యంగా మంచాల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆకుకూరల సాగు గణనీయంగా పెరిగి రైతులు లబ్ధి పొందుతున్నారు. కొద్దిపాటి పొలం ఉన్న రైతు కుటుంబాలు సైతం పరిమిత నీటి వనరులతో తుంపర సేద్యం ద్వారా ఆకుకూరలు పండించి ఉపాధి పొందుతున్నారు.


కోతకు సిద్ధంగా ఉన్న పంట

### సులభంగా మార్కెటింగ్

తుంపర సేద్యంతో ఆకుకూరలు పండిస్తున్న రైతులు హైదరాబాద్‌కు చేరువలో ఉండడంతో మార్కెటింగ్ చిటికెలో చేసుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. ట్యూబుల ద్వారా సరఫరా ఉండడంతో ఆకుకూరల సాగుకు నీటి సరఫరా వాల్వుల సాయంతో విడతలవారీగా పారిస్తున్నారు. ఆ తదుపరి ఆకుకూరల మూటల కట్టడం వంటి పనులు పగటిపూట పూర్తిచేసుకుని రాత్రిజామునే ఆటో ట్రాలీలు, బైకులు, ఇతర వాహనాల్లో నగరానికి చేరుకొని మార్కెటింగ్ ప్రక్రియ పూర్తిచేసి తెల్లవారుజామునే ఇళ్లకు చేరుకుంటున్నారు. దాంతో ఇంటిల్లిపాదికి కూలీల అవసరం లేకుండా రోజువారీగా రెండు, మూడు వేలదాకా ఆదాయం పొందుతున్నారు. గ్రామాల్లో రైతులు అధిక సంఖ్యలో తుంపరసాగుపై దృష్టిసారించడంతో ఆటో ట్రాలీ నడిపేవారు సైతం రోజువారీ ఉపాధి పొందుతున్నారు.

### డ్రిప్‌లో ఆధునిక హంగులు

వ్యవసాయంలో డ్రిప్ సిస్టం మరింత ఆధునిక హంగులతో కాలానుగుణంగా మార్పు చెందుతోంది. దీనినే తుంపర సేద్యంగా పిలుచుకుంటూ అన్నదాతలు సాగుబడిలో నిమగ్నమయ్యారు. తుంపర సాగులో పైప్‌లైన్ ఏర్పాటు, నీటి సరఫరాకు అవసరమయ్యే పరికరాలను నిపుణుల అవసరం లేకుండా రైతులు స్వయంగా బిగించుకుంటున్నారు. ట్యూబ్‌లతో కూడిన పైప్‌లైన్ విస్తరణ, తుంపర పద్ధతిలో పైపుల ద్వారా వర్షంలా కురిసే నీటితో ఆకుకూరలు జీవం పోసుకొని ఏపుగా పెరిగి కాపునిస్తున్నాయి. ఎగుడుదిగుడుగా ఉన్న మెట్ట పొలాల్లోనూ ఈ ట్యూబుల ద్వారా రైతులు ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తున్నారు. తదుపరి పంటకాలం పూర్తికాగానే ట్యూబ్ పైప్‌లైన్‌ను మడిచిపెట్టి వేరే పొలానికి తరలిస్తున్నారు. కాలువల ద్వారా పంటలకు నీటి సరఫరా అనేది గతంగా మారింది. ఈ విధానంలో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధిస్తున్నారు. పైగా తుంపర నీటి సరఫరాతో తోటలకు ప్రతిరోజూ నీరుపెట్టే అవకాశం ఉంది. ఒక ఎకరం పారే నీటి వనరులతో సుమారు 5 ఎకరాలు పారేంత సదుపాయం ఈ తుంపర సేద్యంలో ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. మెట్టపొలాల్లో వర్షం నీరు పొలంలో నిలవకుండా ఉండడంతో ఆకుకూరలకు చీడపీడలు సోకకుండా ఆరోగ్యకరమైన, అధిక దిగుబడులు వస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, భూమి దున్నే సమయంలో కల్టివేషన్ మొత్తం ట్రాక్టర్‌తో జరుగుతుండడం రైతులకు శారీరక శ్రమ తగ్గినట్లయింది.

### టీపులతో సేద్యం బాగానే ఉంది



టీపులతో సేద్యం బాగానే ఉంది. మేము ఇదివరకు రూ.వేలల్లో ఖర్చుచేసి మడులు అచ్చుకట్టి సేద్యం చేసేవాళ్లం. మడులు దున్ని పీకెలు, కాల్వలు చేసి పగలు,రాత్రి విరామం లేకుండా నీటిని పెట్టేటోళ్లం. దాంతో రోజుకు ఒక్క మడి కూడా పారకపోయేది. నీరు ఎక్కువ,తక్కువ అవుతుండటంతో తెగుళ్లు వచ్చి పంట నష్టపోయేటోళ్లం. ఇప్పుడు టీపులను ఉపయోగించి మంచిగా సాగు చేస్తున్నాం.

- మంతని జంగయ్య, జాపాల


ఇబ్రహీంపట్నంలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం


రైతు బజార్ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీలోకి వెళ్లే రోడ్డు .. శని, ఆదివారాల్లో ఈ రోడ్డు ఇరువైపులా కూరగాయలు విక్రయించే వారితో రద్దీతో మారుతుంది..

# రోడ్డుపక్కన వ్యాపారాలు.. గాలిలో ప్రాణాలు

(5వ పేజీ తరువాయి)

క్రితం తెల్లవారుజామున ఓ కారు ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్‌తో సహా ఐదుగురు మహిళలు అక్కడిక్కడే దుర్మరణం చెందారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి.

### నిరుపయోగంగా రైతు బజార్‌లు

ప్రభుత్వం రైతు బజార్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించినా వాటిని సద్వినియోగం చేసుకోక నిరుపయోగంగా మారుతున్నాయి. కూరగాయలను తరలింపునకు రవాణా ఖర్చులు భరించలేక రోడ్ల పక్కనే అమ్మకాలు చేస్తున్నారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో 2016 నవంబరు 19న చేవెళ్ల మండల కేంద్రంలో అప్పటి మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, తన్నీరు హరీ‌ష్‌రావు రైతు బజార్ నిర్మాణానికి రూ.50 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. రైతు బజారుతో పాటు పక్కనే షెట్టర్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. చివరకు అంచనా వ్యయం రూ.95 లక్షలకు పెరిగింది. 2020 జూన్ 6వ తేదీన అప్పటి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి రైతు బజార్‌ను ప్రారంభించారు. సుమారు నెల రోజుల పాటు రైతు బజార్ బాగానే కొనసాగింది. తర్వాత రైతులు, వ్యాపారులు రైతుబజార్‌కు వెళ్లడం మానేసి రోడ్డు పక్కన అమ్ముకోవడం ప్రారంభించారు. దీంతో రెండేళ్లుగా రైతు బజార్ నిరుపయోగంగా దర్శనమిస్తుంది. అలాగే కందుకూరు మండల కేంద్రంలో రూ.30 లక్షలతో కూరగాయల మార్కెట్‌ను నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది. శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలో రోడ్డు పక్కన సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు కూరగాయలు విక్రయిస్తున్నారు. యాచారం మండలం నందివనపర్తిలో కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రారంభించి ఆరేళ్లవుతున్నా పూర్తి కాలేదు. రూ.30 లక్షలతో నిర్మాణం చేపట్టారు. మరో రూ.20 లక్షలు కేటాయించి పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. కేశంపేట మండల కేంద్రంతో పాటు కొత్తపేట గ్రామంలో సంత రోజుల్లో రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో సంత రోజున ట్రాఫిక్‌ను మళ్లించాల్సి వస్తుంది. కొందుర్గు, చౌదరిగూడలో కూడా రోడ్లపైనే విక్రయాలు జరుగుతున్నాయి. షాద్‌నగర్‌లో రైతు బజార్లు లేవు, కాలనీల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కూరగాయలు విక్రయిస్తున్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం జరుగుతుంది. మేడ్చల్ పట్టణంలో వ్యాపారస్తుల కోసం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కీసరలో రోడ్డుపై ప్రధాన చౌరస్తాలో చిరు వ్యాపారులు పూలు, పండ్ల షాపులు తాత్కాలికంగా వేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. ఇబ్రహీంపట్నంలో రోడ్డుపై ఉన్న కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు, తోపుడు బండ్లపై పూల విక్రయాలు జరుగుతున్నాయి. అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాయలం రోడ్డు వరకు, చౌరస్తా నుంచి మంచాల వెళ్లే రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు జరుపుతున్నారు.


కీసర చౌరస్తాలో వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు

దాంతో కొనుగోలుదారులు కూడా వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైతు బజారు రోడ్డు శని, ఆదివారాల్లో కిక్కిరిసిపోతుంది. బైక్‌ల సంగతి పక్కన పెడితే కాలినడకన వెళ్లడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. రోడ్లపైనే వ్యాపారం కొనసాగిస్తున్నా.. వాహనాలను పార్కింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

### పూర్తికాని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు

ఇబ్రహీంపట్నంలో కూరగాయలతో పాటు మాంసం దుకాణాలు, పూలు, పండ్ల విక్రయాలు రోడ్డుపైనే కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఏళ్ల తరబడిగా ఈ తంతు కొనసాగుతున్నా.. అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడంలేదు. ప్రతీ బుధవారం జరిగే సంతతో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా మొదలు తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుకిరువైపులా వస్తు సామగ్రి, కూరగాయల వ్యాపారంతో మరీ ఇబ్బందిగా మారింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద రెండేళ్ల క్రితం రూ.1.06 కోట్ల వ్యయంతో 36 మడిగెలతో కూరగాయల కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినా నేటికీ అందుబాటులోకి రాలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించలేదు. పక్కనే రూ. 4.50 కోట్ల నిధులతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. నిధులు విడుదల చేయకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. అలాగే ఆమనగల్లులో రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. రోడ్లపైనే కూరగాయలు, చేపల విక్రయాలు జరుగుతున్నాయి. వికారాబాద్ జిల్లా పరిగిలో కూరగాయల మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో నడి రోడ్డుపై కూరగాయ విక్రయాలు జరుపుతున్నారు.

## నేల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రైతు వేదికల వద్ద నేడు(గురువారం) నేల(మృత్తిక) సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అవగాహన కార్యక్రమాలుంటాయన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మానవాళికి ఆహారం అందించే నేలను సంరక్షించుకొని భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించేలా మనం వ్యవసాయం చేయాలని తెలిపారు. రైతు సోదరులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమాల్లో విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని ఆమె తెలిపారు.

## ఊబిలో ఇరుక్కున్న ఎడ్లు

- 4గంటలపాటు బురదలో విలవిల్లాడిన పశువులు
- చివరకు ఎక్స్‌కవేటర్‌తో బయటికి తీసిన గ్రామస్తులు


బురద నీటిలో దిగబడిన ఎడ్లు

తాండూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నీటి కాల్వలో పేరుకున్న ఊబిలో రెండుఎడ్లు చిక్కుకున్నాయి. నాలుగు గంటల పాటు అవి బయటకు రాలేక అవస్థ పడ్డాయి. ఈ సంఘటన బుధవారం చంద్రవంచ శివారులో జరిగింది. చంద్రవంచకు చెందిన రైతు బొడ్డు సమ్మప్ప తన రెండు ఎడ్లతో పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో సర్వే నంబర్-13లోని ఓ పొలం చుట్టూ పంటలోకి వాన నీరు రాకుండా కాలువ తవ్వారు. ఆ కాల్వలో నీరు నిలిచి ఊబిగా మారింది. ఆ మార్గంలో వచ్చిన రెండు ఎడ్లు బురదలో కూరుకుపోయాయి. ఎడ్లను బయటికి లాగేందుకు రైతు సమ్మప్ప అష్టకష్టాలు పడ్డాడు. ఒక్కడి నుంచి కాక గ్రామస్తులకు తెలిపాడు. చేరుకున్న గ్రామస్తులు కూడా ఎడ్లను బురదలో నుంచి బయటికి తీసేందుకు ప్రయత్నించారు. ఎంతకూ ఎడ్లు బయటకు రాలేదు. చివరకు ఎక్స్‌కవేటర్ తెప్పించి ఎడ్లను బయటకు లాగారు.

## నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు


పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ రఘునాథ స్వామి

శామీర్‌పేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందని మేడ్చల్ డీఎంహెచ్‌వో రఘునాథ స్వామి అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం కొత్త పీహెచ్‌సీలను ప్రారంభిస్తుందన్నారు. బుధవారం మండలంలోని తుర్కపల్లిలో కొత్తగా నిర్మించిన పీహెచ్‌సీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చి దిద్దటానికి కృషి చేస్తున్నామన్నారు. తుర్కపల్లిలో ప్రారంభించిన పీహెచ్‌సీ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయన్నారు. మందుల కొరత లేకుండా అనుభవజ్ఞులైన సిబ్బందితో వైద్య సేవలు అందించటానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోలేని నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేసుకునే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దెమర్రి నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, కృష్ణారెడ్డి, వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు గుణపాఠం చెప్పినా మార్పు రావడం లేదు

పెద్దేముల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలు బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టి ఆ పార్టీ నాయకులకు గుణపాఠం చెప్పినా వారిలో మార్పు రావడంలేదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దేముల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పాలకులు అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటి వడ్డీలు కడుతున్నారని అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ దానిని చేయకపోగా కాంగ్రెస్ పార్టీని నిందిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు తప్పక నెరవేరుస్తుందని చెప్పారు. మంచిపని ఏది చేద్దామన్నా కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందనే దురుద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు దానిని పాడు చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, నాయకులు లొంక నర్సిములు, మహిపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఉప్పరి మల్లేశం, డిఫై.నర్సిములు తదితరులు పాల్గొన్నారు.


గొట్లపల్లి ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

### మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గొట్లపల్లిలో బుధవారం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం వండడానికి ముందే ప్రతీరోజు సరుకుల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఆహారం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

## పేదలను ఆదుకుంటాం

యాచారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలు తీర్చుతూ వారిని ఆదుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. బుధవారం మాల్‌కు చెందిన వరమ్మకు మంజూరైన రూ.28వేలు, యాదమ్మకు రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈమేరకు ఆయన నివాసంలో అందించారు. పేదలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## సొంత డబ్బుతో సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్తూర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని అంబేడ్కర్ కాలనీలో గల పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాలకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కర్రొళ్ల సురేందర్ సొంత డబ్బుతో సీసీ కెమెరాలను బిగింపజేసి ఉదారతను చాటుకున్నాడు. స్థానిక పోలీసులు చేసిన సూచనను దృష్టిలో పెట్టుకుని సొంత డబ్బుతో పాటు, కాలనీవాసులు ప్రోత్సాహంతో ఆలయాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సురేందర్ చెప్పారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సురేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జెనిగె శివకుమార్, రవీందర్, అనిల్‌కుమార్, దర్శన్, రాజేందర్, జయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

చౌదరిగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ అన్నారు. బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఇంద్రనగర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మారోజు లక్ష్మణాచారి జ్ఞాపకార్థం ఉపాధ్యాయుడు ప్రకాశ్ డోనేట్ చేసిన మధ్యాహ్న భోజన ప్లేట్లను తహసీల్దార్ విద్యార్థులకు అందజేశారు. సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషమని అన్నారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఉదయ్ కుమార్, రవి, నర్సింహులు, శ్యామల, రాజయ్య, సంజు తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడ : విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్

# వరికోతలు.. యంత్రాల కొరత

- సరిపడా హార్వెస్టర్లు లేక రైతుల ఇక్కట్లు
- మెషీన్ల కొరతతో వాడిపోయి నేలకొరుగుతున్న వరి
- ఒకేసారి కోతకు రావడంతో తప్పని తిప్పలు
- చేతికొచ్చిన పంట నేలకొరుగుతున్న వైనం



నేలకొరుగుతున్న వరి పంట

చౌదరిగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన వరి పంట చేతికందడంతో కోతకు ఇబ్బందిగా మారింది. వరికోసే హార్వెస్టర్ల కొరత కారణంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చిన పంట కోతదశలో నేలకొరుగుతుంటే అన్నదాతలకు ఏం చేయాలో అర్థం కావడంలేదు. ప్రస్తుతం ఉమ్మడి కొందుర్గు మండలంలో చాలా గ్రామాల్లో వరికోతలు అరకొరగానే కొనసాగుతున్నాయి. ఇంతకుముందు ప్రతీఏడాది ఒకేసారి కోతలకు రాకపోవడంతో హార్వెస్టర్లు అందుబాటులో ఉండేవి. ఈసారి అలాకాకుండా దాదాపు అందరు రైతులు సాగుచేసిన వరి పంట కోతకొచ్చింది. దాంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగిపోయింది. ఈక్రమంలో మెషీన్లు దొకరడం కష్టంగా మారింది. అయితే, ఇప్పుడిప్పుడే వరికోతలు మొదలెట్టి ధాన్యాన్ని కల్లాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు హార్వెస్టర్లు దొరక్కపోవడంతో ఏంచేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

### హార్వెస్టర్‌తో సమయం ఆదా



గతంలో వరికోతలు కూలీలతో చేపట్టేవాళ్లం. నేడు సకాలంలో దొరక్కపోవడంతో యంత్రాలపై ఆధారపడ్డాం. కానీ, హార్వెస్టర్ల కొరతతో సకాలంలో పంటలు కోతలు వేయలేకపోతున్నాం.

**- అంకం పాండు, లక్ష్మీదేవిపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలం**

### అడ్వాన్స్‌లు ఇస్తామన్నా దొరకడం లేదు



నాలుగు ఏకరాల్లో వరి సాగు చేశా. కోతకొచ్చిందని హార్వెస్టర్ల నిర్వాహకులకు డబ్బులు అడ్వాన్స్ ఇస్తామన్నా అందుబాటులో లేవు. దాంతో పంటల కోతలు ఆలస్యం కావడంతో పంట వాడిపోయి నేలకొరిగిపోతోంది.

**- అజీజ్, తుమ్మలపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలం**

### రైతులపై అదనపు భారం

గతంలో వరికోతలు కూలీలతోనే కానిచ్చేవారు. నేడు గ్రామాల్లో కూలీల కొరతతో రైతులు హార్వెస్టర్లపై ఆధారపడడంతో సమయం ఆదా అవుతోంది. ఇదిలా ఉండగా.. గతేడాది టైర్ల మెషీన్‌కు గంటకు రూ.2,200 కిరాయి కాగా.. చైన్ మెషీన్ రూ.2500 నుంచి రూ.2800 తీసుకునేవారు. ఈ ఏడాది టైర్ల మెషీన్‌కు రూ. 2,500 తీసుకుంటున్నారు. చైన్ మెషీన్‌కు గంటకు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా అత్యవసర సమయాల్లో హార్వెస్టర్ల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు ధరలు పెంచి కోతలకు దిగుతున్నారు. కాగా, రైతులు ఒకవేళ అకాల వర్షం పడితే పరిస్థితి ఏంటనే ఆందోళనలో ఉన్నారు.

# యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోహన్



అందె మోహన్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యువజన(యూత్) కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షాద్‌నగర్‌కు చెందిన అందె మోహన్ ఘనవిజయం సాధించారు. గత ఆగస్టు 14 మొదలైన ఓటింగ్ ప్రక్రియ సెప్టెంబరు 14వరకు కొనసాగింది. ఈమేరకు బుధవారం సాయంత్రం వెలువడిన ఫలితాల్లో మోహన్ ఎనిమిది వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత యువజన కాంగ్రెస్ కమిటీలోనూ ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

### షాద్‌నగర్ అధ్యక్షుడిగా రాజేష్‌గౌడ్



యూత్ కాంగ్రెస్ షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడుగా సోలిపూర్ గ్రామానికి చెందిన పులిమామిడి రాజేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కేశంపేట మండలానికి చెందిన పిప్పళ్ళ శ్రీనాథ్, తాలుకా ఉపాధ్యక్షుడిగా కడ్తాల శ్రీధర్, షాద్‌నగర్ పట్టణాధ్యక్షుడిగా సాయి వంశీలు విజయం సాధించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఘన విజయాన్ని ఇచ్చిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు అందె మోహన్ కృతజ్ఞతలు తెలిపారు.

### మండలాధ్యక్షుడిగా రమేష్



**కేశంపేట** : యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా పోమాల్‌పల్లికి చెందిన అనుమగళ్ల రమేష్ ఎన్నికయ్యారు. కాగా, రమేష్‌తో పాటు ఆవా రాఘవేందర్, వట్టెల రమేష్, సాయిబాబా, శివప్రసాద్‌గౌడ్‌లు పోటీపడ్డారు. రమేష్ ఎన్నికపట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

### తాలూకా అధ్యక్షుడిగా దళపతిగౌడ్



**మాడ్గుల** : మండలంలోని ఇర్విన్‌కు చెందిన గాజమోు దళపతిగౌడ్ యూత్ కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడిగా విజయం సాధించారు. ఆయనకు పలువురు అభినందనలు చెప్పారు.

### శ్రీకాంత్ ఎన్నిక పట్ల కాంగ్రెస్ నేతల సంబరాలు

**ఆమనగల్లు** : యువజన కాంగ్రెస్ ఆమనగల్లు మండలాధ్యక్షుడిగా వస్పుల శ్రీకాంత్ ఎన్నిక నేపథ్యంలో పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. శ్రీకాంత్‌ను శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా నాయకులు మాండ్లి రాములు, ఎఎంసీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఎగిరిశెట్టి సత్యం, అబ్దుల్‌ఖాదర్, బాబా, దశరథ, ఖాదర్, ఖాద్రి, కరీం, ప్రసాద్, అంజత్, అశోక్, రాజ్‌కుమార్, శివకుమార్‌గౌడ్, శ్రీను, మల్లేష్, గోపాల్ తదితరులున్నారు.



ఆమనగల్లు : శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

**యాచారం** : యువజన కాంగ్రెస్ యాచారం మండలాధ్యక్షుడిగా యాచారంనకు చెందిన పాశం జయప్రకాశ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అయ్యవారిగూడకు చెందిన పి.రామకృష్ణ యాదవ్‌లను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ బుధవారం ప్రకటించింది.

## క్రైం కార్నర్

### అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- భర్త, అత్త హత్య చేశారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపణ
- పోలీసులు అదుపులో భర్త, అత్త.. డెడ్‌బాడీపై తీవ్ర గాయాలు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బుధవారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ కథనం మేరకు ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన సాయికుమార్‌గౌడ్ మహేశ్వరం మండలం డబిల్‌గూడకు చెందిన సుమలత(33)ను 11 ఏళ్లక్రితం వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో భారీగా కట్నకానుకలు ఇచ్చారు. పెళ్లైన కొన్నినెలల వరకు బాగానే కాపురం చేసిన భర్త.. అదనపు వరకట్నం తీసుకురావాలని భార్యను పలుమార్లు మానసికంగా, శారీరకంగా వేధించాడు. ఈక్రమంలో ఈనెల 2న సుమలతకు కడుపునొప్పి వస్తోందని.. హాస్పిటల్‌కు తీసుకెళ్లామని మృతురాలి తల్లిదండ్రులకు భర్త ఫోన్‌చేసి చెప్పాడు. అయితే, మంగళవారం అర్ధరాత్రి మీ కూతురు ఏమీ పలకడం లేదు. మృతి చెందిందని తల్లిదండ్రులకు మళ్లీ ఫోన్‌చేసి చెప్పాడు. అనంతరం సుమలతకు అంత్యక్రియలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో ముఖం, మెడపై తీవ్ర గాయాలు ఉండటాన్ని గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వచ్చి మృతురాలి ఒంటిపై గాయాలను గమనించారు. భర్త సాయికుమార్‌గౌడ్‌ను, అత్త ఇందరమ్మను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ముమ్మాటికీ తమ కూతురుని సాయికుమార్, ఇందిరమ్మలు కలిసి హత్య చేశారని మృతురాలి తల్లిదండ్రులు ఈశ్వరయ్యగౌడ్, భాగ్యమ్మ బోరున విలపించారు. మృతురాలి తమ్ముడు వెంకటేష్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి సాహితి(4), సంయుక్త(2) కూతుళ్లున్నారు. ఇద్దరు చిన్నపిల్లలు మా అమ్మ కావాలని ఏడుస్తుండటం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

### రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

కొత్తూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. మృతుడు 45నుంచి 50సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడని, తెల్లని గడ్డం, గ్రే కలర్ ప్యాంట్, గ్రే కలర్ టీషర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ అభిదేశ్‌యాదవ్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మల్లేశ్వర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 98480-90426 సెల్ నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

### ప్రేమ వ్యవహారంలో నిందితుడి రిమాండ్

చౌదరిగూడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని చెప్పి బాలికను బలవంతంగా తనతో పాటు తీసుకెళ్లాడని పోలీసులు ఓ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై విజయ్ కథనం మేరకు ఎదిర గ్రామానికి చెందిన లింగని రాజు (24) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈనెల 2న చౌదరిగూడ గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమ పేరుతో నమ్మించి తనతో పాటు తీసుకువెళ్లాడు. దాంతో ఆ అమ్మాయి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద రాజుపై కేసు నమోదు చేసి విచారణ చేట్టారు. బుధవారం అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో షాద్‌నగర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ధీరజ్‌కుమార్‌కు నిందుతుడికి 14 రోజుల రిమాండ్ విధించారు.

# ప్రజలే ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి

(5వ పేజీ తరువాయి)

అప్పు చేసిందని ఆరోపించారు. దానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో రూ.67వేల కోట్ల వడ్డీ చెల్లిస్తుందని మంత్రి వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో రింగు రోడ్డు అమ్మి రూ.11 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. సంక్రాంతి తరువాత కేబినెట్‌లో చర్చించి అర్హులకు రైతుభరోసా అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. పంట నష్టానికి ఎకరాకు రూ.10వేలు అందేలా ప్రభుత్వం బీమా సదుపాయాన్ని కల్పించిందని వివరించారు. గత ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అసంపూర్తిగా వదిలేసి ఎన్నికల్లో ఓట్ల కోసం, కమీషన్ల కోసం హడావిడిగా ఓ పంపుహౌజ్‌ను ఆన్ చేసి గొప్పలు చెప్పుకుందని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరానికి రూ.లక్ష కోట్లు కేటాయించి అందినకాడికి బొక్కేశారని ఆరోపించారు. కేఎల్‌ఐని అసంపూర్తిగా వదిలివేయగా, దానిని పూర్తిచేసి రైతులకు రూ.36కోట్ల పరిహారం కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ వ్యూహకర్త మాత్రమేనని, తెలంగాణ బిడ్డల ఆత్మఘోష చూసి సోనియా గాంధీ స్వరాష్ట్రాన్ని ప్రకటించారని మంత్రి జూపల్లి గుర్తు చేశారు. బీజేపీ మత రాజకీయాలు సాగిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి కాంగ్రెస్ గూటికి చేరాడు. మంత్రి జూపల్లి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నాడు. మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో దొంగలు చేతివాటం చూపారు. మంత్రి వచ్చిన సమయంలో జనాలు ఒక్కసారిగా గుమిగూడడంతో జేబులు కత్తిరించారు. సుమారు రూ.1.50 లక్షల వరకు కాజేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్ , టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, ఏడీఏ ఆదిలక్ష్మి, ఏవో శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ ఎంపీపీలు పద్మారెడ్డి, లక్ష్మీదేవిరఘురాములు, నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రవికాంత్‌గౌడ్, బీక్యనాయక్, ఆసిఫ్‌అలీ, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు



ఆమనగల్లులో ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

## రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో నేదునూరు మోడల్‌స్కూల్ విద్యార్థి ప్రతిభ

- మొదటి బహుమతి అందుకున్న వైష్ణవి



కందుకూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌కు చెందిన చీమల వైష్ణవి రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకుంది. బుధవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం వైష్ణవిని సన్మానించారు. ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో రెన్యువల్ ఎనర్జీ రిసోర్స్ అనే అంశంపై ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 33 జిల్లాలకు చెందిన 91మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. వైష్ణవి రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిని గెలుపొందడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## ఎంపీ అరుణను రాజకీయంగా దెబ్బతీయడానికే ప్రొటోకాల్ విస్మరణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను రాజకీయంగా దెబ్బతీయాలన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేశారు. మున్సిపాలిటీలోని తాగునీటి సమస్యను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద నిధులు మంజూరు చేసిందని, ఇందులో భాగంగా మంజూరైన రూ.27.5లక్షలతో చేపట్టిన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ఎంపీని ఆహ్వానించలేదని, ప్రొటోకాల్‌ను విమర్శించిన కమిషనర్‌పై అరుణ ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెట్టబోతున్నదని అన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, కేంద్రం మంజూరు చేస్తున్న నిధులతో శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప, కాంగ్రెస్ చేసిందేమీలేదన్నారు. లగచర్ల రైతుల పక్షాన నిలిచిన ఎంపీని రాజకీయంగా దెబ్బతీయాలన్న కుట్రతోనే ఆమెను ఆహ్వానించలేదన్నారు. ఇకపై ప్రొటోకాల్‌ను విస్మరిస్తే సహించబోమని హెచ్చరించారు. మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రుషికేష్, తదితరులున్నారు.

## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



ఆలూరులో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి, పక్కన యాదయ్య

చేవెళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీబీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, పలువురు నాయకులతో కలిసి ఆలూరు మార్కెట్ వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఆలూరు, నాన్‌చెరు వ్యక్తుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. చనిపోయిన ముగ్గురు వ్యక్తుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరి చొప్పున రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం రంజిత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వారి పిల్లల చదువులకయ్యే ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు. ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, షాబాద్ దర్శన్, గిరిధర్‌రెడ్డి, అనంత రాములుగౌడ్, నరేందర్‌చారి, రవీందర్, జంగయ్య, సురేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తీవ్ర నైరాశ్యంలో యాచారం మండల కాంగ్రెస్ నాయకులు

- మార్కెట్ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న నేతలకు నిరాశే

యాచారం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకులకు తీవ్ర నిరాశే మిగిలింది. మార్కెట్ కమిటీ ఏర్పడ్డ కొత్తలో.. 25 ఏళ్ల క్రితం మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన లచ్చిరెడ్డి చైర్మన్ పదవి దక్కించుకున్నారు. నాటి ఎమ్మెల్యే నాయిని అనంతరెడ్డి పదవి ఇప్పించారు. తర్వాత బీఆర్‌ఎస్, తెలుగుదేశం, నేటి కాంగ్రెస్ పాలనలో చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులు అన్నీ ఇబ్రహీంపట్నం, మంచాల మండలాలకు చెందిన నాయకులకే దక్కాయి. చైర్మన్ పదవిపై నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ముత్యాల వెంకట్‌రెడ్డి, యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణయాదవ్‌లు ఆశలు పెట్టుకున్నారు. తీరా పాలకవర్గం ప్రకటించడం, మండలానికి మొండిచెయ్యి చూపడంతో కార్యకర్తలు తీవ్ర నిరాశలో ఉన్నారు. దాంతో కొందరు పార్టీని వీడే అవకాశముందని సమాచారం.

# లింక్ రోడ్లను సుందరంగా నిర్మిస్తాం

కొత్తూర్/షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే లింక్(బీటీ) రోడ్లను సుందరంగా నిర్మిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రం నుంచి బైపాస్ రోడ్డులోని జేపీ దర్గా చౌరస్తా వరకు రూ.18కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. మండల కేంద్రం నుంచి లింక్ ఉన్న జేపీ దర్గా రోడ్డు, కుమ్మరిగూడ రోడ్లను త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. కుమ్మరిగూడ రోడ్డుకు రూ.32కోట్లు మంజూరు చేశామన్నారు. షాద్‌నగర్ ట్రాన్స్‌కో డీఈ శ్యాంసుందర్‌రెడ్డితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడుతూ దర్గా రోడ్డులో ఉన్న హైటెన్షన్ వైర్లను పక్కకు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్, మండల శాఖల అధ్యక్షులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు జెనిగె జగన్, కమ్మరి జనార్ధన్‌చారి, వసుపుల మహేందర్, పీర్లగూడెం మహేష్‌గౌడ్, ఎమ్మె సత్తయ్య, ఇందూరి శ్రీనివాస్, కర్రొళ్ల సురేందర్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ(అల్లిసాబ్‌గూడ) శివారులో ఉన్న సెరికల్చర్ స్థలంలో అన్ని వసతులతో అధునాతనంగా ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల భవనాలను నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులున్నారు.



## సంక్షిప్తంగా..

- **యాచారం** : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో నరేందర్ రెడ్డి సోషల్‌వేల్ఫే హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తక్కళ్లపల్లి పాఠశాలను సందర్శించి వచ్చే సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికలకు అనువుగా ఉందా? లేదా అని ఆరా తీశారు. గ్రామంలో హరితహారం నర్సరీని సందర్శించి మొక్కలకు నిత్యం నీరందించాలని పంచాయతీ సిబ్బందిని ఆయన ఆదేశించారు.
- **కేశంపేట** : చౌలపల్లికి 24 గంటల విద్యుత్ సరఫరాకు టాన్స్‌కో అధికారులు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ గూడ వీరేశ్ సమస్యను ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి 24గంటలు విద్యుత్ సరఫరా జరిగేందుకు ప్రత్యేక లైన్ వేయాలని ఆదేశించారు. అధికారులు గ్రామానికి 24 గంటలు విద్యుత్ అందించేందుకు ప్రత్యేక లైన్‌వేసి సరఫరా చేస్తున్నారు. క్యాంపు కార్యాలయంలో వీరేశ్‌కు విద్యుత్ సరఫరాకు సంబంధించి మంజూరులేఖను ఎమ్మెల్యే శంకర్ అందించారు.
- **ఆమనగల్లు** : మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని శ్రీరామ దూత ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ శివానంద స్వామి అన్నారు. పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన కార్తీక మాస ఆకుపూజల ముగింపు వేడుక నిర్వహించగా శివానంద స్వామి హాజరయ్యారు. అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**చౌదరిగూడ** : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఇన్‌చార్జి ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

**ఇబ్రహీంపట్నం** : జెడ్పీహెచ్‌ఎస్ ఇబ్రహీంపట్నం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో టీషర్టులు అందజేశారు. 280 మంది బాలికలు విద్యనభ్యసిస్తుండగా వీరిని గ్రూపులుగా చేసి వివిధ రంగుల టీ షర్టులు అందజేశారు.

**కేశంపేట** : షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు మేరకు షాద్‌నగర్ పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల నిర్మాణానికి కేశంపేట మండల కేంద్రానికి చెందిన, కాంగ్రెస్ నాయకుడు తలసాని పవన్‌కుమార్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌ను కలిసి రూ.51,000 చెక్కును అందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, ఏఎంసీ డైరెక్టర్ కరుణాకర్, నాయకులున్నారు.

**తలకొండపల్లి** : గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు ప్రకటించారు. మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 35వ రోజుకు చేరాయి.

# మహిళా సంఘాలకు పెద్దపీట



శంకర్‌పల్లి : చెక్కులందజేస్తున్న యాదయ్య

శంకర్‌పల్లి/చేవెళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీన్‌కుమార్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో పొదుపు గ్రూపు మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద మంజూరైన రూ.1.95 కోట్ల చెక్కులను బుధవారం ఆయన అందజేశారు. కొత్తగా కొనుగోలు చేసిన రెండు స్వచ్ఛ ఆటోలను ప్రారంభించి పారిశుధ్య కార్మికులను సన్మానించారు. జడ్పీహెచ్‌ఎస్‌లో అదనపు తరగతి గదులకు భూమిపూజ చేశారు. వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, ఎంఈవో అక్బర్, కౌన్సిలర్ చంద్రమౌళి, కో-ఆప్షన్ సభ్యుడు మైమూద్, మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి. ప్రకాశ్, ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, కాశెట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని విజయోత్సవ ప్రజాపాలన చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జీ వినోద్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడాది పాలన విజయోత్సవ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలను దశలవారిగా అమలు చేస్తు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పీసీబీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, సున్నపు వసంతం, కార్యకర్తలు ఉన్నారు.

**ఇబ్రహీంపట్నం** : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే ఆ కుటుంబాలు మరింత వృద్ధిలోకి వస్తాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళా సంఘాలకు కోటి రూపాయల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ప్రత్యేకాధికారి నవీన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగ, కమిషనర్ రవీంద్రసాగర్, ఇబ్రహీంపట్నం, మంచాల ఎంపీడీవోలు వెంకటమ్మ, బాలశంకర్ తదితరులున్నారు.

**షాద్‌నగర్ రూరల్** : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఆశించిన విధంగా పాలన కొనసాగిస్తోందని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. గురుకుల విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. కృష్ణారెడ్డి, నర్సింలు, అరుణ, అంజయ్యగౌడ్, ఫారెస్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు